ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలి

బండ్లగూడ: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పని చేయాలని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు రంజిత్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ ఏ–బ్లాక్ అధ్యక్షుడు డప్పు నవీన్‌కుమార్, బండ్లగూడ జాగీరు మాజీ సర్పంచ్ గంగని హరికృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసి సన్మానించారు. అలాగే బండ్లగూడలో నెలకొన్న పలు సమస్యలపై ఆయనకు వివరించారు. ప్రధానంగా ఉన్న తాగునీటి సమస్యను తెలిపి సత్వరమే పరిష్కరించాలని కోరామన్నారు. దీనికి స్పందించిన ఎంపీ రంజిత్‌రెడ్డి వెంటనే జలమండలి మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడి వేసవి కాలం నేపథ్యంలో ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఎంపీ రంజిత్‌రెడ్డి, నాయకులు

రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేసి మరోసారి చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డిని గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టింకు, అమీన్, శేఖర్, ప్రేమ్, శ్రీనివాస్, నాగేష్, పాండు, నరేష్, అర్జున్ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో పారిశుద్ధ్య కార్మికులకు గాయాలు


పారిశుద్ధ్య కార్మికులను పరామర్శిస్తున్న ఎస్ఎఫ్ఏలు, ఏఐటీయూసీ నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో పని చేసే పారిశుద్ధ్య కార్మికులు విధులకు వస్తుండగా ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ..పారిశుద్ధ్య కార్మికులు ఉదయం 4:30 గంటలకు పెద్ద గోల్కొండ, చిన్న గోల్కొండ, గ్రామాల నుంచి విధులకు వస్తుండగా.. కిషన్‌బాగ్, శంషాబాద్ మార్గం మధ్యలో డీసీఎం వెనుకాల నుంచి ఆటోని ఢీకొట్టడంతో అందులోని సి.నిర్మల, హంసమ్మ, డి.మాధవీలకు తీవ్ర గాయాలయ్యాయి. శంషాబాద్‌లోని సన్‌రైజ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న కార్మికులను వనంపల్లి జైపాల్‌రెడ్డి, శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు కె.అనిల్ కుమార్, వి.రాజు, ఎన్.అశోక్‌లతో కలిసి పరామర్శించారు.

చేవెళ్లలో బీజేపీ జెండా ఎగరవేస్తా

కొండా విశ్వేశ్వర్ రెడ్డి


మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రాజేంద్రనగర్: చేవెళ్ల పార్లమెంటు స్థానంపై బీజేపీ జెండాను ఎగరవేస్తానని చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ అసెంబ్లీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశాన్ని అసెంబ్లీ కన్వీనర్ పొన్నామోని మల్లేష్ యాదవ్ అధ్యక్షతన ఆదివారం రాజేంద్రనగర్, ఉప్పర్‌పల్లి పీఆర్ ప్యాలెస్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఎన్నికల నేపథ్యంలో తాను చేపట్టిన ప్రజా ఆశీర్వాద యాత్రకు అన్ని వర్గాల ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. ప్రజల సంక్షేమంతో పాటు మౌలిక వసతులు కల్పించడంలో గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యాయని ఆయన ఆరోపించారు. బీజేపీ గెలిపించి నరేంద్ర మోదీని మరోసారి ప్రధానిని చేయడానికి ప్రతీ కార్యకర్త చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నరసింహా రెడ్డి, రాజేంద్రనగర్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, ఎస్సీ మోర్చా జ్ఞానేశ్వర్, రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ మెంబర్ పరమేశ్వర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా సెక్రటరీ వెంకట్ రెడ్డి, బీజేవైఎం నాయకులు శ్రీకాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

మైలార్‌దేవ్‌పల్లి: గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆరాంఘర్ నుంచి శంషాబాద్ వెళ్లే ప్రధాన రహదారిలోని ఆదివారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఎస్‌వీఎం మాల్ పక్కన నిర్మానుష్య ప్రదేశంలో గుర్తుతెలియని మహిళ మృతదేహం (40)గా గుర్తించారు. చుట్టు పక్కన వారిని విచారించినా ఫలితం లేకపోవడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట


చార్మినార్ కట్టడం వద్ద సందర్శకుల సందడి

కోటకు పర్యాటక శోభ..

గోల్కొండ: మండే ఎండలో సైతం గోల్కొండ కోట పర్యాటక శోభను సంతరించుకుంది. ఆదివారం గోల్కొండ కోటకు వేల సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. ఉదయం 8 గంటల నుంచే కోట బుక్కింగ్ కౌంటర్ ముందు పర్యాటకులు బారులు తీరారు. ఈ ఆదివారం కోటకు వచ్చిన పర్యాటకులలో ఇతర రాష్ట్రాలకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. చాలా మంది టూరిస్టు బస్సులలో తరలి వచ్చారు. కోట దిగిన పర్యాటకులు నగినాబాగ్‌లోని పచ్చని చెట్ల నీడన సేదతీరారు.

చార్మినార్: పాతబస్తీ చార్మినార్ పరిసరాలు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు చార్మినార్ కట్టడంతో పాటు మక్కా మసీదు, చౌమహల్లా ప్యాలెస్, సాలార్‌జంగ్ మ్యూజియం, జూపార్కు తదితర పర్యాటక ప్రాంతాలన్నీ సందర్శకులతో కళకళలాడాయి. చార్మినార్ కట్టడం వద్ద రోజంతా పర్యాటకుల సందడి కనిపించింది. ఎండను సైతం లెక్క చేయని సందర్శకులు అధిక సంఖ్యలో పాతబస్తీలోని పర్యాటక స్థలాలను సందర్శించారు. పర్యాటకుల సంఖ్య పెరగడంతో చిరు వ్యాపారాలు కూడా జోరుగా కొనసాగాయి.


గోల్కొండ కోటలో పర్యాటకులు

చేటు చేస్తున్నా.. చెట్లు తీయరా..?

- శంషాబాద్‌లో వేలల్లో కోనో కార్పస్‌చెట్లు
- పర్యావరణంతో పాటు ప్రజలకు హానికరంగా మారుతున్న వైనం
- తొలగించకపోవడంతో ప్రజల్లో ఆందోళన


శంషాబాద్‌లో జాతీయరహదారికి ఇరువైపులా కోనో కార్పస్ చెట్లు

శంషాబాద్: ఆ చెట్లు చేటు చేస్తాయని పర్యావరణ ప్రియులు.. శాస్త్రవేత్తలు అనేకమార్లు స్పష్ట ం చేశారు. నష్టం కలిగించే సంబంధిత చెట్లను తొలగించాలని స్థానికులు సైతం తీవ్ర ఆందోళన వ్యక్త చేస్తున్నారు..అయినా స్థానిక అధికారులు ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోవ డం లేదు. పట్టణంలో వేలల్లో ఉన్న కోనో కార్ప స్ చెట్లు కొంపముంచుతున్నా కొంచమైనా పట్టి ంచుకోకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

సాతంరాయి నుంచి శంషాబాద్ వరకు..

సాతంరాయి నుంచి మొదలుకొని శంషాబాద్ పట్టణం వరకు జాతీయ రహదారికి ఇరువైపులా హరితహారంతో భాగంగా వేలాది చెట్లను పెంచారు. అదే విధంగా కాముని చెరువు కట్టపై సుమారు కిలో మీటరున్న పొడవుగా వేలాది కోనో కార్పస్ చెట్లు పెంచారు. వీటితో పాటు అనేక ప్రాంతాల్లో పట్టణంలో సుమారు లక్షకు చేరువలో కోనో కార్పస్ చెట్లు పెరిగాయి. ఈ చెట్లు ప్రజల ఆరోగ్యంతో పాటు పర్యావరణంపై దుష్ప్రభావాన్ని చూపుతాయని పర్యావరణ ప్రియులు శాస్త్రవేత్తలు గుర్తించి అనే వేదికలపై వెల్లడించారు. ప్రభుత్వం సైతం నర్సరీల్లో ఈ మొక్కలు రాకుండా ఆదేశాలు జారీ చేశారు. కొన్ని చోట్ల ప్రాథమిక దశలోనే వాటిని తొలగించారు. శంషాబాద్ పట్టణంలో కూడా ఈ చెట్లు నాటిన కొత్తలోనే పర్యావరణ ప్రియులు, స్థానికులు తొలగించాలని పలుమార్లు అధికారులకు విన్నవించారు. ప్రజల ఫిర్యాదులు, వినతులను అధికారులు పట్టించుకోకపోవడంతో ఇప్పుడవి భారీ పెద్ద ఎత్తున పెరిగాయి. ఇప్పుడు వాటిని తొలగించాల్సిన ఆవశ్యకత ఉన్నా అధికారులు ఆ దిశగా కనీస చర్యలు కూడా తీసుకోవడం లేదు. నిత్యం నడక, వ్యాయామం చేసుకునేందుకు బయటికి వచ్చే ప్రజలతో పాటు ప్రయాణికులందరికీ ఇవి చేటు కలిగించే స్థాయిలో పెరిగాయి.

దుష్ప్రభావాలు..

ఈ చెట్ల కారణంగా శ్వాసకోస ఇబ్బందులు, అనేక రకాల అలర్జీలు వచ్చేందుకు ఆస్కారం ఉంది. 80 మీటర్ల లోతు వరకు పారే వీటి వేర్లతో భూగర్భ జలాలు సైతం భారీ దెబ్బం తింటున్నాయి. ఉదయం, సాయంత్రం నడక, వ్యాయామం కోసం బయటికి వెళ్లేవారితో పాటు ప్రయాణికులు సైతం వీటి నుంచి వచ్చే కార్బన్ డైయాక్సైడ్ కారణంగా అనారోగ్యం బారిన పడుతున్నామని ఇటీవల శంషాబాద్ వాసులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేశారు. అయినా ఇప్పటి వరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఫిర్యాదు చేసినా చర్యలు లేవు..



హరితహారంలో కోన్సో కార్పస్ చెట్లు నాటిన ప్రాథమిక దశలోనే వాటి కారణంగా జరిగే చెడు గురించి అందరికీ తెలిసింది. అప్పట్లో ప్రభుత్వం తొలగించమని సూచించినా అధికారులు ఎక్కడ తొలగించలేదు. శంషాబాద్ పట్టణంలో లక్షకు చేరువలో కోనో కార్పస్ చెట్లు న్నాయి. వీటి కారణంగా ఇప్పటికే రోగాల బారిన పడుతున్నారు. ఈ విషయమై నెల రోజుల కిందట జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. ఇప్పటి వరకు అధికారులు స్పందించం లేదు. ప్రజలకు, పర్యావరణానికి నష్టాన్ని కలిగించే వాటిపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలి.

– ప్రదీప్, ఏబీవీపీ నాయకుడు

'లైన్‌మెన్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం'

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని సులేమాన్‌నగర్ డివిజన్ నా నంబర్‌లో ఆదివారం ఉదయం 6 గంటలకు వాటర్ వర్క్స్ లైన్‌మెన్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి అన్నారు. డైరీ ఫామ్ పిల్లర్ నంబర్ 207 వద్ద రెండు రోజుల కింద కార్మికులపై జరిగిన దాడి ఘటన మరువకముందే అదే సులేమాన్‌నగర్ డివిజన్ పరిధిలో ఆదివారం 6 గంటలకు వాటర్ లైన్‌మెన్ పి.జగదీష్ వాటర్ లైన్‌ను వదలడం జరిగిందన్నారు. రోడ్డు మీద వాటర్ వృథాగా కడుగుతుంటే పలుమార్లు వృథా చేయొద్దని చెప్పారు. అయినా కూడా అదే విధంగా నీళ్లను వృథాగా చేస్తుంటే చేయొద్దని ఫొటో తీస్తుంటే వాటర్ లైన్‌మెన్ ఫోన్ లాక్కొని దాడి చేయడం జరిగిందన్నారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఇలాంటి దాడులు చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని.. లేదంటే రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, వాటర్ వర్క్స్, మలేరియా తదితర విభాగాల్లో పని చేసే కార్మికులతో కలిసి ఆందోళన నిర్వహిస్తామన్నారు.

గచ్చిబౌలిలో ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో నిర్వాహకులకు పండ్లు తినిపిస్తున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా

రాయదుర్గం: గచ్చిబౌలిలో సయ్యద్ పాషా ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా హాజరై నిర్వాహకులకు పండ్లు తినిపించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు తాహెర్, నవాజ్, ఇతర ముస్లింలు, వివిధ పార్టీల నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూళ్లలో రాజేంద్రనగర్ సర్కిల్ రికార్డు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది రికార్డు సృష్టించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ఆస్తి పన్ను వసూలు చేశారు. చివరి రోజు ఏకంగా మూడు కోట్లకు పైగా వసూలు చేసి తమ టార్గెట్ పూర్తి చేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్, రాజేంద్రనగర్ డివిజన్‌లు ఉన్నాయి. డివిజన్ పరిధిలోని ఇంటి యజమానుల నుంచి 2023–24 సంవత్సరానికి గాను 52 కోట్ల రూపాయల టార్గెట్‌గా అధికారులు నిర్ణయించారు. గత కొన్ని రోజులుగా కమిషనర్ రవి కుమార్ ప్రత్యేక దృష్టి సారించి ఆస్తిపన్నును వసూలు చేయడం ప్రారంభించారు. రోజువారి టార్గెట్‌లను విధిస్తూ ఆస్తిపన్నును వసూలు చేయడం ప్రారంభించారు. దీంతో ఎన్నడూ లేని విధంగా సర్కిల్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నానికి రూ.51 కోట్ల రూపాయల ఆస్తిపన్ను వసూలు చేశారు. మరో కోటి రూపాయల కోసం అధికారులు, సిబ్బంది ప్రయత్నాలు ప్రారంభించారు. కోటి రూపాయలు వసూలవుతే నూటికి నూరు శాతం ఆస్తిపన్ను వసూలు చేసిన సర్కిల్‌గా గ్రేటర్‌లో నిలవనుంది.

చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


చలివేంద్రాన్ని ప్రారంభించిన నరేందర్‌రెడ్డి

మణికొండ: వేసవి కాలంలో సేవా సంస్థలు, దాతలు ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల కూడలిలో అరుణాచల సేవా సంస్థ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి కూడలిలో అనేక సేవా సంస్థలు అడుగడుగునా చలివేంద్రాలను ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు సి.బీరప్ప, నాయకులు బి.శివకుమార్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

'రంజాన్ మాసం ఎంతో పవిత్రమైంది'


సమావేశంలో మహ్మద్ నజీబ్ తదితరులు

గోల్కొండ: రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని సీనియర్ మజ్లిస్ నాయకుడు, తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. ఆదివారం టోలిచౌకీ అక్బర్‌బాగ్‌లోని తన కార్యాలయంలో ఆయన రంజాన్ ఇఫ్తార్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇఫ్తార్ ప్రత్యేకతలను మరోసారి తెలియజేసేందుకు తాను ఏప్రిల్ 5న గోల్కొండ రిసాలబజార్‌లోని ఒవైసీ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఇఫ్తార్ పార్టీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ విందులో ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఆయన అన్నారు. ఇఫ్తార్‌కు ఆల్ ఇండియా ఖీరత్ కమిటీ అధ్యక్షుడు మౌలానా ఖారీ సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీ ఆధ్వర్యం వహిస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఖాలేద్ అలీఖాన్, సయ్యద్ ఖాజా తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం కార్వాన్ నియోజకవర్గం నుంచి పలువురు నాయకులు ఆయనను టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఒక్కొక్కరి సమస్యలను విన్నారు. సమస్యల పరిష్కరించడానికి తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని తమ తమ ప్రాంతాల్లోని సమస్యలను తన దృష్టికి తేస్తే వెంటనే వాటిని పరిష్కరిస్తానన్నారు. తరచూ తాను స్వయంగా ఉన్నతాధికారుల కార్యాలయాలకు వెళ్లి కార్వాన్ నియోజకవర్గ సమస్యలను వివరిస్తున్నానన్నారు. అంతేకాకుండా అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించి వివిధ అంశాలపై చర్చిస్తున్నానన్నారు. ప్రస్తుతం తాగునీటి సరఫరా ఒక్కటే ప్రధాన అంశం అని ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఎక్కడా నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తలేదన్నారు.

ప్రత్యేక పూజలు



జియాగూడ: ఆలయాలను సందర్శించి హైందవ సనాతన ధర్మం విశిష్టతను తెలుసుకోవాలని బజరంగ్‌సేనా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు గుప్తా అన్నారు. ఆదివారం జియాగూడ ఇమాంపురాలో గల చారిత్రక శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ఇమాంపురా శ్రీ పంచముఖి హనుమాన్ సేవాదళ్ అధ్యక్షులు గుండ్రపల్లి మహేందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సూర్యశుక్లా, కాశాధికారి పవన్ ఇందోరియ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ప్రణయ్



శంషాబాద్: ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా కె.వై ప్రణయ్, కార్యదర్శిగా బి.శంకర్‌ను ఎన్నుకున్నారు. జిల్లా ఎస్ఎఫ్ఐ 25 మహాసభలు ఆదివారం పట్టణంలో ముగిశాయి. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం ప్రణయ్ మాట్లాడుతూ.. విద్యారంగంలో నెలకొంటున్న సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ నిరంతర పోరాటాలు చేస్తుందన్నారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాలలను ఏర్పాటు చేయాలన్నారు. విద్యా రంగంలో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాల డైట్ చార్జీలను కూడా ప్రభుత్వం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

వైభవంగా మల్లన్న జాతర


చౌదరిగూడలో జాతర ఉత్సవంలో పాల్గొన్న నరేందర్

శంషాబాద్ రూరల్: చౌదరిగూడలో నిర్వహించిన మల్లన్న జాతర ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆదివారం గ్రామస్తులు బోనాల ఊరేగింపుతో స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్న, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కె.నరేందర్, పార్టీ ప్రధాన కార్యదర్శి సీహెచ్.మహేందర్, పెద్దషాపూర్ మాజీ సర్పంచు చంద్రశేఖర్, నాయకులు ఆనంద్, గోవర్ధన్, సప్తగిరిగౌడ్, జహంగీర్, శ్రీనివాస్, మల్లికార్జున్, ప్రేమ్‌అలోక్, నందు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు ఆహ్వానం


ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

రాజేంద్రనగర్: బాబూ జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ప్రతినిధులు కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్‌ని కలిసి ఆహ్వానం అందజేశారు. ఆమెను కలిసిన వారిలో పోయిల జీవన్ దాస్, టీ.ఆర్.శ్రీరాములు, కోరని దయానంద్, గోల్కొండ రాజ్ కుమార్, పంబాల రాజు, బాబురావు, ప్రీతం రాజ్, తలారి రాజ్ కుమార్, బర్ల సుమన్, జంగయ్య, ఉపేందర్, సంజీవ, ఎడ్లకాడి చంద్రశేఖర్, బచ్చల మహేశ్, కవ్వగూడెం గౌతమ్, రమేశ్ మాదిగ, పోయిల వికాస్ పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపీట

చాంద్రాయణగుట్ట: పాతబస్తీలో శాంతి భద్రతల పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య అన్నారు. ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి నిర్వహించిన కార్డన్ సెర్చ్‌లో ఆయన పాల్గొన్నారు. 100 మంది పోలీసులతో కలిసి నిర్వహించిన ఈ సెర్చ్‌లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలు, మూడు కార్టన్ల బీర్లు, పది లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నారు. రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్ల తమ ప్రవర్తన మార్చుకోని యెడల పీడీ యాక్ట్‌లు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ షేక్ జహంగీర్, ఛత్రినాక డివిజన్ ఏసీపీ సీహెచ్.చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్

రాయదుర్గం: బీజేపీ గెలుపుతోనే మన ప్రాంత అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవి కుమార్ యాదవ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలో డివిజన్ స్థాయి శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకుల సమావేశాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళికతో పనిచేస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని పేర్కొన్నారు. చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని మరోసారి బలపర్చాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా ఐక్యంగా ఇంటింటికీ తిరుగుతూ కేంద్రం చేసిన సంక్షేమ, అభివృద్ధి పనులను వివరిస్తూ బీజేపీకే ఓటు వేసేలా చూడాలన్నారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి రావడం, మూడో సారి నరేంద్రమోదీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు అనితారెడ్డి, కృష్ణముదిరాజ్, బూత్‌కమిటీ, ఇన్‌చార్జిలు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, డివిజన్, జిల్లా, రాష్ట్ర నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్.రాములు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జాతీయ సాహిత్య పరిషత్ భాగ్యనగర్ శాఖ ఆధ్వర్యంలో రచయిత్రి డాక్టర్ సరోజన బండ రచించిన 'వాచకాలు మన వారసత్వ సంపద'పుస్తకావిష్కరణ సభ ఆదివారం రవీంద్ర భారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ పూర్వ అధ్యక్షుడు బీఎస్. రాములు మాట్లాడుతూ..తెలుగు వాచకాలపై మరిన్ని పుస్తకాలు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారి సునీత భగవత్, పాఠశాల విద్య ఆర్‌జేడీ విజయలక్ష్మి, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, వెలిదండి శ్రీధర్, అపర్ణ, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వేడుకలకు హాజరైన క్రైస్తవులు


మణికొండ ది లైఫ్ చర్చి ప్రార్థనల్లో పాల్గొన్న క్రిస్టియన్‌లు

ఘనంగా ఈస్టర్ వేడుకలు


ఖానాపూర్‌లో..

మణికొండ: ఏసుక్రీస్తు పునరుత్థానం పొందిన రోజును ఈస్టర్ పండగగా క్రిస్టియన్‌లు ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. గండిపేట మండల పరిధిలోని అన్ని చర్చిలలో ఆదివారం ఉదయం నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజల శ్రేయస్సు కోసం ఏసుక్రీస్తు సిలువను మోసి లోకం విడిచి వెళ్లి తిరిగి మూడవ రోజు లేచి వచ్చి మనందరినీ కాపాడుతున్నారని ఫాస్టర్‌లు సందేశం ఇచ్చారు. మణికొండ ది లైఫ్ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో బ్రదర్ అనిల్‌కుమార్ ఏసుక్రీస్తు సందేశాన్ని వినిపించారు. ప్రార్థనల అనంతరం పలు చర్చిలలో పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. పెద్ద ఎత్తున క్రిస్టియన్‌లు పాల్గొన్నారు.

బుద్వేల్‌లో..

రాజేంద్రనగర్: ఈస్టర్ పండుగను బుద్వేల్‌లో క్రైస్తవ సహోదరులు ఆదివారం ఎంతో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పార్లమెంటు మాజీ సభ్యులు డాక్టర్ రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ సమాజమంతటికీ ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా 40 ఏళ్ల నుంచి ఈస్టర్ పండుగను జరుపుకునే స్థలం విషయమై సమస్య తీరుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఆశోక్, ఫాస్టర్ జోయెల్‌తో పాటు క్రైస్తవులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.